క్లుప్తంగా

ముగిసిన ఉరుసు



స్వాముల వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురంలో వెలసిన సయ్యద్ మీరసావలి సాసర్ షరీఫ్ ఉరుసు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. మూడు రోజులుగా నిర్వహించిన స్వాముల వారి ఉరుసు మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ముగింపు రోజున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వాముల వారికి కాయ, చెక్కెర సమర్పించు మొక్కులు తీర్చుకున్నారు. మరికొంత మంది భక్తులు జెండాలు ఎక్కించి, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై ప్రసాదాలను తీసుకొచ్చి స్వాములవారికి సమర్పించారు.

వాలీబాల్ విజేత చింతమానుపల్లె జట్టు



వాలీబాల్ క్రీడాకారులతో అధికారులు

సి.బెళగల్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీలలో మండల జట్టుగా చింతమానుపల్లె జట్టు విజేతగా నిలిచింది. మండల కేంద్రం సి.బెళగల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఆయా సచివాలయ ఉద్యోగులు నిర్వహించారు. సెమీ ఫైనల్లో కొత్తకోట -1, చింతమానుపల్లె, కొత్తకోట -2, సి.బెళగల్ -2 జట్లు తలపడగా, చింతమానుపల్లె, సి.బెళగల్ - 2 జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఫైనల్లో సి.బెళగల్ - 2 జట్టుపై చింతమానుపల్లె జట్టు విజయం సాధించిందని పీడీలు వెంకటేశ్వర్లు, సుంకరావు తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గ్రామోత్సవం



పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ గ్రామోత్సవం నిర్వహించినట్లు ఈఓ రామకృష్ణ మంగళవారం తెలిపారు. తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి శ్రీ వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు.

కారు బోల్తా ... నలుగురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయని ఎస్ఐ అశోక్ తెలిపారు. మహబూబ్ నగర్ చెందిన టీఎస్ 07 జేజే 2033 నంబర్ వేగనార్ కారు మహానంది నుంచి బయలుదేరింది. ఈ క్రమంలో టైర్ బరస్టు అయ్యి పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొన్నట్లు తెలిపారు. కారులో ఉన్న యశోద, సరోజ, సిద్దన్న, బాలకృష్ణలకు గాయాలైనట్లు తెలిపారు. హైవే సిబ్బంది గాయపడిన వారిని కర్నూలుకు తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య లేకుండా కారును తొలగించారు.

భజంత్రీ సేవలను కొనసాగించండి

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామంలో అర్ధాంతరంగా నిలిపివేసిన భజంత్రీ సేవలను కొనసాగించాలని ఆ గ్రామ సర్పంచ్ పెద్ద వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం కాల్వబుగ్గ దేవస్థానంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత కొన్నేళ్ల నుంచి గ్రామంలో పండుగలు, ఉత్సవాల సందర్భంగా భజంత్రీల మధ్య ఉత్సవ మూర్తులను ఊరేగింపుతో తీసుకెళ్లడం ఆనాదిగా వస్తున్న సాంప్రదాయం అన్నారు. అందుకుగాను పూర్వీకులు భజంత్రీ సేవకులకు 86.5 ఎకరాల మాన్యం భూమిని కేటాయించడం జరిగిందన్నారు. అయితే భజంత్రీ సేవకులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడంతో గత ఏడాది నుంచి ఆలయ సాంప్రదాయం ప్రకారం జరగాల్సిన స్వామి వారి విధిసేవలు నిలిచిపోయినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈఓ ప్రసాద్ కల్యాణ సేవకులను పిలిపించి వారం రోజుల్లో మళ్లీ సేవలను కొనసాగించాలని కోరారు.

నేడు కుస్తీ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్టేడియంలో జిల్లా స్థాయి కుస్తీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం సెక్రెటరీ రాబర్ట్ మంగళవారం తెలిపారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు ఈ నెల 20, 21 తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు పంపుతామన్నారు. క్రీడాకారులు రెండు పాస్ ఫోటోలు, ఆధార్ కార్డుతో రావాలని జిల్లా రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు రమేష్ బాబు తెలిపారు. పురుషుల ఫ్రీస్టైల్, గ్రీకో రోమన్ విభాగాల్లో, మహిళల ఫ్రీ స్టైల్ విభాగాల్లో వివిధ బరువుల కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు.

నెరవేరనున్న దశాబ్దాల కల

- హంద్రీనదిపై రూ.24 కోట్లతో కాజ్‌వే నిర్మాణం
- పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న సీఎం వైఎస్.జగన్
- 12 గ్రామాలకు తీరనున్న అవస్థలు





గోరంట్ల హంద్రీనదిలో నిర్మాణ దశలో ఉన్న కాజ్‌వే పనులు

కోడుమూరు : దశాబ్దాల కళను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేరుస్తోంది. దాదాపు 12 గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. కోడుమూరు మండలం గోరంట్ల గ్రామం దగ్గర హంద్రీనదిపై కాజ్‌వే నిర్మాణానికి రూ.24 కోట్లు ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం మంజూరు చేసింది. నిర్మాణ పనులు చేపట్టేందుకు ఓఎంఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ టెండర్ దక్కించుకుంది. రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేస్తామన్న ఒప్పందం కుదుర్చుకున్న ఆ సంస్థ ప్రతినిధులు గతేడాది పనులు ప్రారంభించారు. ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్రలో భాగంగా క్రిష్ణగిరి మండలంలోని ఎస్.హెచ్.ఎర్రగుడి నుంచి హంద్రీనది మీదుగా కోడుమూరు మండలంలోని గోరంట్ల గ్రామానికి 2017 నవంబర్ 27వ తేదీన నడుచుకుంటూ వచ్చారు. ఆ సమయంలో ఆ ప్రాంత ప్రజలు హంద్రీనదిపై కాజ్‌వే నిర్మించాలని కోరారు. మన ప్రభుత్వం వస్తే కాజ్‌వే నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని అప్పట్లో వైఎస్‌జగన్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు కాజ్‌వే నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించనుంది.

ప్రయాణం సులువు

గోరంట్ల నుంచి కొత్తపల్లె, ఎస్.హెచ్.ఎర్రగుడి గ్రామాలకు రెండు కిలోమీటర్లు దూరం ఉందది. హంద్రీనదికి వరద వస్తే 15 కిలోమీటర్లు ప్రయాణం చేసి ఆయా గ్రామాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఉండేది. హంద్రీకి వరద వచ్చే సమయాల్లో విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి. కాజ్‌వే నిర్మాణం పూర్తయితే క్రిష్ణగిరి, కోడుమూరు మండలాల పరిధిలోని 12 గ్రామాలకు కష్టాలు తొలగనున్నాయి. కొత్తపల్లె, రామక్రిష్ణాపురం, ఎస్.హెచ్. ఎర్రగుడి, ఎర్రబాడు, చుంచు ఎర్రగుడి, మన్యగుంట, క్రిష్ణగిరి, బాపనదొడ్డి, కంబాలపాడు, గుండ్లమల్లాపురం, ఆగవేళి, పి.కోటకొండ గ్రామాల ప్రజలకు కర్నూలు వెళ్లేందుకు ప్రయాణం సులువవుతోంది. పంట ఉత్పత్తులు రవాణా చేసుకునేందుకు ప్రయాణ భారం తగ్గుతోంది. పెళ్లిళ్ళు, ఆసుపత్రులకు వెళ్లేందుకు దూరభారం తగ్గుతోంది. వచ్చే ఏడాది మార్చి నెలఖారులోపల కాజ్‌వే నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

వంతెన లేక ఎదుర్కొన్న కష్టాలివి

- గోరంట్ల నదిపై వంతెనలేక దశాబ్దాలుగా దాదాపు 12 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలివి.
- గోరంట్ల గ్రామం దగ్గర ఉన్న హంద్రీనది ప్రతిఏటా వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. అప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నారు.
- ఈ నదిని దాటి వెళ్లేందుకు క్రిష్ణగిరి, కోడుమూరు మండలాల్లోని 12 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.
- కొన్ని సందర్భాల్లో హంద్రీనది పొంగిపొర్లితే రోజులు తరబడి రాకపోకలు నిలిచిపోయేవి.
- అత్యవసర సమయాల్లో కోడుమూరు, కర్నూలు పట్టణాలకు చేరుకోవాలంటే కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వచ్చేది.
- పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రతిరోజూ హంద్రీనదిని దాటుకొని వెళ్లాలంటే నరకయాతనే.
- కాన్పుల కోసం గర్భిణులు, వివిధ వ్యాధుల భారిన పడిన రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే ప్రజలు నరకయాతన అనుభవించేవారు.
- గోరంట్ల హంద్రీనదిపై వంతెన నిర్మాణ పనులు పూర్తయితే కర్నూలు, కోడుమూరు పట్టణానికి చేరుకోవాలంటే ఆయా గ్రామప్రజలు 10 నుంచి 20 కిలోమీటర్ల ప్రయాణ భారం తగ్గుతోంది.

పట్టించుకోని టీడీపీ నేతలు

క్రిష్ణగిరి మండలం కంబాలపాడు నేతలు రాజకీయంగా ఎంతో ఎత్తుకుఎదిగి ఎన్నో పదవులు అనుభవించారు. రాకపోకల సౌకర్యం కోసం హంద్రీనదిపై కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా వేడుకుంటున్నా కేఈ సోదరులు పట్టించుకోలేదు. కేఈ సోదరులు తమ సొంత ఊరు కంబాలపాడుకు వెళ్లాలన్న కర్నూలు నుంచి డోన్ మీదుగా వెవెళ్తున్నారు. దాదాపు 60 కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్నారు కేఈ సోదులు. గోరంట్ల బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయితే కర్నూలు నుంచి గోరంట్ల మీదుగా కంబాలపాడుకు కేవలం 35 కిలోమీటర్లలో ప్రయాణంలో చేరుకోవచ్చు. కాజ్‌వే బ్రిడ్జిలేక ఆ ప్రాంత ప్రజలు నిరంతరం ఎదుర్కొంటున్న సమస్యను కేఈ సోదరులు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పట్టించుకోలేదు.

మా ఊళ్లకు దేవుడు జగనే



నా వయస్సు 30 ఏళ్లు. నేను చిన్నప్పటి నుంచి ఈ హంద్రీనదిపై నడుచుకుంటూ అవస్థలు పడుతున్నాం. మా గ్రామాల ప్రజలు హంద్రీనదిపై బ్రిడ్జి వేయించాలని పర్శిన నాయకులను కాళ్లావేళ్లాపడినా కనుకరించలేదు. మా అధ్యక్షానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా ఊరి మీదుగా నడుచుకుంటూ వెళ్తూ హంద్రీనదిపై బ్రిడ్జి వేయిస్తానని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం గోరంట్ల హంద్రీనదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా గ్రామాల ప్రజలకు దేవుడే.

– హరిక్రిష్ణ, ఎస్.హెచ్.ఎర్రగుడి

త్వరలో పనులు పూర్తి చేస్తాం

గోరంట్ల హంద్రీపై కాజ్ వే నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పిల్లర్ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. పిల్లర్లపై వంతెన వేసేందుకు కాంట్రాక్టర్ వనరులు సమకూర్చుకుంటున్నారు. ఇప్పటి వరకు 30 శాతం పనులు జరిగాయి. నిర్మాణ సంస్థ ప్రభుత్వంతో కుదుర్చుకున్న అగ్రిమెంట్ ప్రకారం నిర్ణీత కాలవ్యవధిలోనే పనులను పూర్తి చేయిస్తాం.

– చౌడేశ్వరరావు, డీఈఈ

పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ సీనియర్ నాయకులు కపిలేశ్వరయ్య

కర్నూలు కల్చరల్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు కపిలేశ్వరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాల విభజన తరువాత సాగునీటి పథకాలన్నీ నంద్యాలలో ఉన్నాయన్నారు. జిల్లాలో తాగునీరు కూడా దొరకని స్థితి నెలకొందన్నారు. గుండ్రేవుల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని అన్ని పార్టీలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఆ తర్వాత పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేయాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి మొదటి వారంలో 5 రోజుల పాటు గుండ్రేవుల నుంచి కర్నూలు కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ కర్నూలు అసెంబ్లీ మాజీ కన్వీనర్ రంగస్వామి, జిల్లా నాయకులు కాశింగ్ నరసింహ వర్మ, కాశీ విశ్వనాథ్, సందడి సుధాకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాలతి, కోడుమూరు అసెంబ్లీ కన్వీనర్ ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రామిరెడ్డి తాత సేవలు చిరస్మరణీయం



రామిరెడ్డి తాత ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు

కల్లూరు: అవధూత రామిరెడ్డి తాత సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరులో సేవ సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 31 ఆరాధన మహోత్సవ ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వారు తాత విగ్రహానికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి సమాధిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అవధూత రామిరెడ్డి తాత ఎంతోమందిని సన్మార్గంలో నడిపించారని చెప్పారు. మధ్యాహ్నం భక్తులకు సేవ సంస్థాన్ సభ్యులు అన్నదానం చేశారు. కల్లూరులో అవధూత రామిరెడ్డి తాత చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్రరెడ్డి, కోశాధికారి హనుమంతరెడ్డి, ముల్లు వెంకటరెడ్డి, శ్రీరాములు, రైతు సంఘం నాయకులు రంగన్న, లలితా పీఠం పీఠాధిపతులు శ్రీసురమేదా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో న్యాయమూర్తులు



మహానందిలో హైకోర్టు న్యాయమూర్తి

మహానంది: అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బుజ్జప్ప కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం మహానందికి వచ్చారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరి దేవి, మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేసుకున్నారు. ప్రత్యేక యాగశాలలో న్యాయమూర్తి దంపతులకు స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి వేదపండితులు ఆశీర్వచనం చేయించారు. అలాగే గుంతకల్లు సీనియర్ సివిల్ జడ్జి మంజుల, రైల్వే కోడూరు సీనియర్ సివిల్ జడ్జి అంజనా ప్రియదర్శిని వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ మధు ఆధ్వర్యంలో వారికి స్వాగతం పలికి పూజలు నిర్వహింపచేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

మహానందీశ్వరుడికి విరాళాలు

మహానంది దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద వితరణ కోసం మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి గ్రామానికి చెందిన నరసింగరావు, కుటుంబ సభ్యులు రూ. 5116, గోనెగండ్ల నిధికి రూ.5,000 విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతల సహకారం ఎంతో ఉందని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- ఉత్తర ద్వారం ప్రారంభానికి హంపి పీఠాధిపతి



ఉత్తర ద్వారం ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న ఎద్దుల మహేశ్వరరెడ్డి

కోడుమూరు రూరల్ : దాతల సహకారంతో కోడుమూరులో రూ.10కోట్ల వ్యయంతో పురాతన వల్లిలో రాతి దూలాలు, రాతి స్తంభాలతో పునర్నిర్మిస్తున్న పంచాయతన దేవతా సహిత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉత్తర ద్వారం ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎద్దుల మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న ఉత్తర ద్వారాన్ని ఈనెల 22వ తేదీన హంపి పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గిరిజనుల అభ్యున్నతికి సమగ్ర ప్రణాళిక



వర్చువల్‌గా ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి మోదీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- వర్చువల్‌గా పీఎంతో పాల్గొన్న చెంచులు
- పాల్గొన్న నంద్యాల కలెక్టర్, ఎమ్మెల్యే, ఐటీడీఏ పీఓ

పాణ్యం: దేశంలోని గిరిజన అభ్యున్నతి, వారి ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. పాణ్యం మండలం నెరవాడ మెట్ట గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి–జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్మన్) కార్యక్రమంలో గిరిజనులతో ప్రధాని వర్చువల్‌గా ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమానికి నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి, నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు, న్యూ ఢిల్లీ మోటా జనరల్ మేనేజర్ ఆరెకే కర్నన్‌తో పాటు ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ పక్కా గృహాలు, ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి, గ్రామ రహదారుల నిర్మాణం, ప్రతి ఇంటికి విద్యుత్, అందరికి ఆరోగ్యం, పౌష్టికాహారంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఉచిత రేషన్‌తో పాటు ఆయుష్మాన్‌భారత్ ద్వారా గిరిజనులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు.

సీఎం జగన్ చొరవతో చెంచులకు ప్రభుత్వ పథకాలు–ఎమ్మెల్యే

అనాదిగా సంప్రదాయ వృత్తులపై ఆధారపడిన చెంచుల అభివృద్ధి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఎన్నడు లేని విధంగా గిరిజనులకు వైద్య కళాశాల, కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్మాణం, విశ్వవిద్యాలయం నిర్మాణం, సీసీ, బీటీ రోడ్లు వేశామన్నారు. కుల వృత్తులో రాణించేందుకు బ్యాంకుల రుణాలు అందించారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాణ్యం చెంచులకు ఇంటి స్థలాలు ఇచ్చారన్నారు. వలంటీర్ల ద్వారా గడపకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని గుర్తు చేశారు. ఐటీడీఏ ద్వారా అనేక లబ్ధి చేకూరుతుందన్నారు. అనంతరం లంబాడీ నృత్యాలు, వైద్య పరీక్షల స్టాల్స్, తెనేతో తయారైన ఉత్పత్తులను ప్రదర్శించారు. స్టాల్స్‌ను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు, కేంద్ర టీమ్, కలెక్టర్, ఐటీడీఏ అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేనబీ, సర్పంచ్ మాధవి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వెంకటశివప్రసాద్, డీఎంఅండ్‌హెచ్ వెంకటరమణ, ఐటీడీఏ ఈఈ లత, ప్రిన్సిపాల్ మేరీ సలోమీ, మండల, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి జీపీడీపీపై శిక్షణ

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) నిర్వహణపై శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గుర్తింపు, ప్రాధాన్య అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. ఎంపీటీసీ సభ్యులు, ఉద్యోగులు శిక్షణ, వార్డు సభ్యులు శిక్షణకు హాజరయ్యేలా చూడాలని అధికారులు, పంచాయతీ కార్యదర్శులను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కోరారు.

నేడు జీపీడీపీపై శిక్షణ

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు జీపీడీపీపై శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ దస్తగిరి మంగళవారం తెలిపారు. ఉదయం 10గంటలకు సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఫ్రంట్‌లైన్ వర్కర్స్ అందరు హాజరు కావాలన్నారు. జీపీడీపీ ప్రణాళిక గురించి వివరిస్తున్నట్లు చెప్పారు.

నేడు వలంటరీ పోస్టులకు ఇంటర్వ్యూలు

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండలంలోని అమడగుంట్ల, లద్దగిరి గ్రామాల్లో ఖాళీగా ఉన్న మూడు వలంటరీ పోస్టులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. అమడగుంట్ల–1, లద్దగిరి 0–2 వలంటరీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. అమడగుంట్ల గ్రామం నుంచి బీసీ–ఈ కేటగిరికి సంబంధించి ఎలాంటి దరఖాస్తులు రాలేదని, లద్దగిరి గ్రామం నుంచి 2పోస్టులకు 2దరఖాస్తులు రాగా ... ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చెప్పారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

కర్నూలు : ఆత్మకూరు మండలం దుద్యాల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుపై బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. వెంకటేశ్వర్లు ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఓ మహిళను హైదరాబాద్‌కు తీసుకెళ్లి కొంతకాలం సహజీవనం చేసి తిరిగి తాండ్రపాడుకు తీసుకువచ్చి వదిలేశాడు. సోమవారం రాత్రి మహిళ భర్త, కుటుంబ సభ్యులు కలిసి వెంకటేశ్వర్లుపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి తల్లి పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఊరూరా సంక్రాంతి సంబరాలు



తిమ్మందొడ్డి గ్రామస్తులు తుంగభద్ర నదిలో భక్తజనసందోహం

గడివేముల: మకర సంక్రాంతి, కనుమ పండగలను సోమ, మంగళవారాల్లో మండల ప్రజలు సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఏ ఇల్లు చూసినా కూతుర్లు, అల్లుళ్లు బంధువులతో సందడి నెలకొంది. ప్రతి ఇంటావిడ వంటలు ఘుమఘుమలాడాయి. గంగిరెద్దుల కోలాహలం కన్పించింది. మహిళలు వేకువజామునే ఇంటి ముంగిట ముగ్గులు వేసి అందులో గొబ్బెమ్మలను పెట్టి గౌరీదేవి వ్రతాలను ఆచరించారు. మంచాలకట్ట గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండలంలోని మూల పెద్దమ్మ ఆలయం, బాలాజీ టెంపుల్, గని బృందావనం, వంటి ప్రముఖ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి ఉత్సవమూర్తులను గడివేముల గ్రామంలో వైఎస్సార్ ఐసాని సునీల్ కుమార్ రెడ్డి, ప్రధాన అర్చకులు శ్యామసుందర శర్మ ఆధ్వర్యంలో ఊరేగించారు. అనంతరం పారువేట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

గూడూరు: మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు మంగళవారం ముగిశాయి. ప్రజలు అత్యంత వైభవంగా సంక్రాంతి కొత్త ఆహ్వానించారు. ముగ్గుల పోటీలు, పతంగులు ఎగుర వేసి సంబరాలు చేసుకున్నారు.

సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామస్తులు తుంగభద్ర నదిలో సంక్రాంతి సంబరాలను మనంగా జరుపుకున్నారు. మకర సంక్రాంతి సందర్భంగా సోమవారం సాయంకాలం గ్రామ ప్రజలు తుంగభద్ర నదిలోని శ్రీ నందీశ్వరులున్న బండ దగ్గరకి చేరి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బీసమ్మ, గ్రామ సర్పంచ్ నాగలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుందరీకరణ పనులు త్వరలోనే పూర్తి



మహానంది ఆలయ ప్రాంగణంలో కార్తీక్‌రెడ్డి

మహానంది: మహానందిలో సుందరీకరణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తనయుడు, నియోజకవర్గ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం ఆయన శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేయించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ మహేశ్వర రెడ్డితో చర్చించారు. అనంతరం ఓంకారం, కృష్ణనంది క్షేత్రాలకు వెళ్లి పూజలు చేసుకున్నారు. ఓంకారం చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ బండిఆత్మకూరు మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డిలు కార్తీక్‌రెడ్డికి స్వాగతం పలికారు.

శిల్పా కార్తీక్ రెడ్డికి ఆయోధ్య ఆహ్వానం

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డికి ఆత్మకూరు అయోధ్య రామజన్మ భూమి తీర్థ ట్రస్ట్ కమిటీ సభ్యులు రామచంద్రగౌడ్ ప్రతిష్ఠ ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం పట్టణంలోని ఈజీస్టోగార్డెన్‌లో కేపీఎల్ టోర్నమెంట్‌లో భాగంగా మ్యాచ్‌ను కార్తీక్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మొమిన్ మన్సూర్‌అలీ కూతురు వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుల్తాన్, విజయ్‌చౌదరి, పువ్వాడ భాస్కర్, మొమిన్‌మునీర్‌బాషా, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.